

అలరించిన నాట్య ప్రదర్శన

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల ఆలయ నిత్యకళావేదికపై బుధవారం చెన్నైకి చెందిన తెలుగు తరుణి గ్రూప్, నరసరావుపేటకు చెందిన నటరాజ కూచిపూడి వారి ప్రదర్శన భక్తులను అలరించింది.



కమాండెంట్‌గా దీపిక పాటిల్

ఏపీఎస్పీ కర్నూలు రెండో బెటాలియన్ మెదటి మహిళా కమాండెంట్ ఎం.దీపిక పాటిల్ బాధ్యతలు స్వీకరించారు. జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్, దీపిక పాటిల్ దంపతులు. 8లో▸



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	:1,633 అడుగులు
ప్రస్తుతం	:1,615.28
టీఎంసీల సామర్థ్యం	:105,788
ప్రస్తుతం	:48,052
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	:0
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	:6,961

న్యూస్‌రీల్

పీఎంఏజీవైకి 28 పంచాయతీలు ఎంపిక



మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ జీ నాసరరెడ్డి

కర్నూలు(అర్బన్): ప్రధాన మంత్రి ఆదర్శ గ్రామీణ్ యోజన (పీఎంఏజీవై) పథకం కింద ఉమ్మడి కర్నూలు జిల్లాలో 28 గ్రామ పంచాయతీలు ఎంపికయ్యాయి. ఈ మేరకు బుధవారం సాయంత్రం స్థానిక జిల్లా పరిషత్‌లోని మినీ సమావేశ భవనంలో ఆయా మండలాలకు చెందిన అభివృద్ధి అధికారులు, పంచా యతీ కార్యదర్శులతో సీఈఓ నాసరరెడ్డి సమావేశమై దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఎంఏజీవై కింద ఎంపికైన గ్రామ పంచాయతీల్లో ఒక్కో దానికి రూ.20 లక్షల నిధులు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. ఆయా గ్రామాలకు సంబంధించిన అభివృద్ధి ప్రణాళికను రెండు రోజుల్లో తయారు చేసి పంపాలని సూచించారు. వాటిని జిల్లా కలెక్టర్ పరిశీలించి ఆయా పనులు చేపట్టేందుకు పాలనా అనుమతులు మంజూరు చేస్తారన్నారు. సమావేశంలో జెడ్పీ డిప్యూటీ సీఈఓ ఈవీ సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

ఒకేషనల్ ప్రాక్టికల్ పరీక్షలు ప్రారంభం

కర్నూలు (సిటీ): ఇంటర్మీడియెట్ ఒకేషనల్ పరీక్షలు శనివారం ప్రారంభమయ్యాయి. మొదటి రోజు ఉదయం 14 కేంద్రాల్లో జరిగిన పరీక్షలకు 974 మంది విద్యార్థులకు గాను 911 మంది హాజరు కాగా 63 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం సెక్షన్‌లో 13 కేంద్రాల్లో జరిగిన పరీక్షలకు 734 మంది విద్యార్థులకు గాను 698 మంది హాజరు కాగా 36 మంది గైర్హాజరయ్యారు. ఇంటర్మీడియెట్ ప్రాంతీయ కార్యాలయాధికారి గురవయ్య శెట్టి, పరీక్షల స్పెషల్ ఆఫీసర్ లాలెప్ప డీసీ మెంబర్లు కర్నూలు నగరంలోని మూడు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేంద్రాల్లో ఎలాంటి అవకాశాలు జరగకుండా పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని ఆయా కేంద్రాల కాలేజీల ప్రిన్సిపాల్స్‌కు సూపరింటెండెంట్లకు పలు సూచనలు చేశారు.

మంత్రాలయం సమీపంలో బ్రిడ్జి కం బ్యారేజీ?

- జలమండలి శాఖ ఇంజినీర్లతో చర్చలు

కర్నూలు (సిటీ): మంత్రాలయం సమీపంలో తుంగభద్ర నదిపై బ్రిడ్జి కం బ్యారేజీ నిర్మించాలనే ఆలోచనతో కర్ణాటక ప్రభుత్వం ఉందని ఆ రాష్ట్ర ఇంజినీర్లు బుధవారం జలమండలి శాఖ ఇంజినీర్లతో చర్చలు జరిపారు. బ్యారేజ్ కమ్ బ్రిడ్జితో ఏ రకంగా ప్రయోజనం ఉంటుందనే విషయంపై వివరించారు. కర్ణాటక రాష్ట్రంలోని మాన్వి, సింధనూరు, శిరుగుప్ప నియోజకవర్గాల్లోని 40 రెవెన్యూ గ్రామాల్లో ప్రతి ఏటా వేసవిలో తీవ్ర తాగునీటి ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. ఈ సమస్య పరిష్కారానికి రాయచూరు జిల్లా చికలపర్వి గ్రామం వద్ద తుంగభద్ర నదిపై బ్రిడ్జి కం బ్యారేజీ నిర్మించనున్నామని తెలిపారు. అలాగే కర్నూలు జిల్లాలో 19 గ్రామాలకు సైతం నీటి సమస్య లేకుండా మంత్రాలయం దగ్గర సైతం బ్రిడ్జి కం బ్యారేజీ నిర్మించేందుకు రూ.138 కోట్లతో తమ రాష్ట్రం చేసిన ప్రతిపాదన సైతం పరిశీలనలో ఉందన్నారు. రెండు బ్రిడ్జి కం బ్యారేజీలు 0.318 సామర్థ్యంతో నిర్మించనున్నామని వివరించారు. వీటి నిర్మాణంతో ఏపీ ప్రభుత్వంపై ఎలాంటి భారం పడబోదని తెలిపారు. ఏపీ రాష్ట్రానికి ఎలాంటి నష్టం జరగకుండా బ్యారేజీ నిర్మించాలని కొందరు ఇంజినీర్లు సమావేశంలో ప్రస్తావించారు. జలవనరుల శాఖ కర్నూలు ప్రాజెక్టు సీఈ కబీర్ బాషా, కర్నూలు సర్కిల్ ఎస్ఈతో పాటు ఈఈలు, డీఈఈలు పాల్గొన్నారు.

రోజూ లక్ష మందికి ఉపాధి పనులు కల్పించాలి

కర్నూలు(సెంట్రల్): జిల్లాలో రోజూకు లక్ష మందికి ఉపాధి హామీ పనులు కల్పించాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన టెలీ కాన్ఫరెన్స్ ద్వారా ఉపాధి హామీ పనుల పురోగతిపై ఎంపీడీఓలు, ఏపీడీలు, ఏపీఓలతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రతి పంచాయతీలో ఉపాధి పనులు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటి వరకు నిర్దేశించిన లక్ష్యాల్లో 63 శాతం మందికే పనులు కల్పిస్తున్నారని, నూటికీ నూరు శాతం కల్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతిరోజూ కూలీకి సగటు వేతనం రూ.290పైగానే ఉండేలా చూడాలన్నారు. జిల్లాలోని పెద్దకడబూరు, దేవనకొండ, మంత్రాలయం, కల్లూరు, కోడుమూరు, పత్తికొండ, నందవరం, కౌతాళం, కృష్ణగిరి మండలాల్లో తక్కువ శాతం పనులు జరుగుతున్నాయని, పురోగతి చూపకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. దేవనకొండ మండలంలో ఎక్కువగా వలసలు ఉంటున్నామని, అయినా ఆ మండలాధికారుల్లో కనీస చలనం లేదన్నారు. ఆదోని, కర్నూలు మండలాలు మినీ గోకులాల నిర్మాణాలు వెనుకబడి ఉన్నామని, ఫిబ్రవరి చివరిలోగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. టెలీ కాన్ఫరెన్స్‌లో డ్వామా పీడీ వెంకటరమణయ్య పాల్గొన్నారు.

ట్రెజరీల్లో లంచావతారులు!

- రిటైర్డ్ ఉద్యోగులను జలగల్లా పీల్చి వేస్తున్న సబ్ ట్రెజరీ సిబ్బంది
- పెన్షన్ అరియర్స్ రావాలంటే 2 నుంచి 4 శాతం వరకు కమీషన్లు ఇవ్వాల్సిందే
- ఫ్యామిలీ పెన్షన్ పొందాలంటే రూ.25 వేల నుంచి రూ.50 వేల వరకు ఇచ్చుకోవాల్సిందే
- వేతనాల కంటే ముడుపులే ముద్దన్నట్లుగా ట్రెజరీ సిబ్బంది వ్యవహారం



కర్నూలు(అగ్రికల్చర్): ఉద్యోగులపై ప్రేమ, సానుభూతిని వారు చూపించరు. సాంకేతిక కారణాలు చూపుతూ.. డాక్యుమెంటు లేదని ముప్పుతిప్పలు పెట్టి జేబులు నింపుకుంటారు. కొందరు ట్రెజరీ, సబ్ ట్రెజరీ సిబ్బంది ముడుపుల కోసం జలగల్లా పీడిస్తున్నారని విమర్శలు ఉన్నాయి. ఎఫ్ఎంఎస్ విధానం వచ్చిన తర్వాత జిల్లా ట్రెజరీల్లో అవినీతి కొంత మేర తగ్గినప్పటికీ కొంతమంది ముడుపులు దండుకుంటున్నారని ఆరోపణలు వస్తున్నాయి. జిల్లా ట్రెజరీల్లో కీలకమైన సీట్లలో ఇలాంటి వారే ఎక్కువ ఉన్నారనే చర్చ జరుగుతోంది. కొంతమంది కొన్నేళ్లుగా ఒకే చోట తిష్టవేయడం కూడా అవినీతి పెరిగిపోవడానికి ప్రధాన కారణమైందనే వాదనలు వినిపిస్తున్నాయి.

ముడుపులు ఇవ్వాల్సిందే!

కర్నూలు, నంద్యాల జిల్లా కేంద్రాల్లో జిల్లా ట్రెజరీ కార్యాలయాలు ఉండగా.. కర్నూలు, ఆదోని, నంద్యాలలో డివిజినల్ సబ్ ట్రెజరీ కార్యాలయాలు, బనగానపల్లె, కోవెలకుంట్ల, ఆళ్లగడ్డ, పత్తికొండ, గూడూరు, శ్రీశైలం, ఎమ్మిగనూరు, ఆలూరు, నందికొట్కూరు, ఆత్మకూరుల్లో సబ్ ట్రెజరీ కార్యాలయాలు పనిచేస్తున్నాయి. సబ్ ట్రెజరీలతో పెన్షనర్ల ప్రయోజనాలు చెల్లిస్తారు. నాలుగో తరగతి ఉద్యోగులు, ఎస్‌జీ టీచర్లు, పోలీసు కానిస్టేబుళ్లు, మున్సిపల్ సిబ్బంది పదవీ విరమణ చేసిన సమయంలో, అలాగే ఇతర అన్ని కేటగిరి ఉద్యోగులు, అధికారుల పదవీ విరమణ చేసినప్పుడు స్టేట్ ఆడిట్ నుంచి సర్వీస్ పెన్షన్ ప్రపోజల్స్ జిల్లా ట్రెజరీకి వస్తాయి. అక్కడి నుంచి అవి సబ్ ట్రెజరీలకు వెళ్తాయి. సర్వీస్ పెన్షన్‌దారులకు పెన్షన్, పెన్షన్ అరియర్స్, కమిటేషన్, గ్రాడ్యుటీ వంటివి రూ.20 లక్షల నుంచి రూ.80 లక్షల వరకు చెల్లించాల్సి ఉంది. ఈ మొత్తం చెల్లించడానికి కొందరు సబ్‌ట్రెజరీ అధికారులు, సిబ్బంది... రిటైర్డ్ ఉద్యోగులకు చుక్కలు చూపిస్తారు. పెన్షన్ అరియర్‌ను బట్టి ముడుపుల స్థాయిని నిర్ణయిస్తారు. ఇవన్నీ విడుదల కావాలంటే 2 నుంచి 4 శాతం వరకు కమీషన్లు ఇచ్చుకోక తప్పదు. ఇచ్చుకోకపోతే సీఎఫ్ఎంఎస్‌లో సాంకేతిక సమస్యలంటారు.. ఒక్కో సందర్భంగా అక్రమార్కులే ఏదో ఒక కాగితం తీసేసి... ఇది లేదు తీసుకురాపో.. ఇలా చుక్కలు చూపిస్తారు. ముడుపులు ఇచ్చి పనులు చేసుకోవడం ఇష్టం లేని వారు పై అధికారుల దృష్టికి తీసుకెళ్లి ఆలస్యంగా పనులు చేయించుకుంటున్న సందర్భాలు ఉన్నాయి.

అవినీతి ఇలా..



ఫ్యామిలీ పెన్షన్ చెల్లింపులో సబ్ ట్రెజరీల్లో అవినీతి మరింత ఎక్కువగా ఉంటోంది. ఒక ఉద్యోగి సర్వీస్‌లో ఉండి మృతి చెందిందే ఆయన భార్యకు ఫ్యామిలీ పెన్షన్ ఇస్తారు. ఫ్యామిలీ పెన్షన్ కింద పెన్షన్, పెన్షన్ అరియర్స్, గ్రాడ్యుటీ ఇస్తారు. ఇవి చెల్లించాలంటే సబ్ ట్రెజరీల్లో రూ.25 వేల నుంచి రూ.50 వేల వరకు ముడుపులు ఇచ్చుకోవాల్సి ఉందనే విమర్శలు ఉన్నాయి. ముడుపులు ఇవ్వకపోతే నెలల తరబడి తిరగాల్సిందేనని కొందరు ఆరోపిస్తున్నారు. పెన్షన్ తీసుకుంటున్న వ్యక్తి మరణించినపుడు ఆయన భార్యకు పెన్షన్ ఇవ్వాలి. దీనినే కన్వర్షన్ ఆఫ్ ఫ్యామిలీ పెన్షన్‌గా వ్యవహరిస్తారు. ఇందుకు సంబంధించిన రికార్డు మొత్తం సంబంధిత సబ్ ట్రెజరీల్లోనే ఉంటుంది. కాని ముడుపుల కోసం సీఎఫ్ఎంఎస్‌లో సాంకేతిక సమస్యలు అంటూ చెబుతారు. కన్వర్షన్ ఆఫ్ ఫ్యామిలీ పెన్షన్‌కు సంబంధించిన మొత్తం రికార్డు సబ్ ట్రెజరీల్లోనే ఉంటున్నా.. ముడుపుల కోసం ముప్పు తిప్పలు పెట్టి మూడు చెరువుల నీళ్లు తాగిస్తున్నారు.

ఉద్దేశపూర్వకంగా జాప్యం

కర్నూలు జిల్లా ట్రెజరీలో కొందరు అధికారులు ఆదాయం వచ్చే సీట్ల కోసం పెద్ద ఎత్తున పైరవీ చేస్తారనే విమర్శలు ఉన్నాయి. కొంతమంది ఇచ్చిన దాంతో సంతృప్తి చెందితే వీరు మాత్రం కమీషన్ వసూలు చేస్తారనే ప్రచారం ఉంది. ఏజీ, లోకల్ ఫండ్ కార్యాలయాల నుంచి వచ్చే పెన్షన్ ప్రపోజల్స్‌ను సబ్ ట్రెజరీలకు పంపడంలో కూడా ఉద్దేశపూర్వకంగా జాప్యం చేస్తున్నట్లు తెలుస్తోంది. మామూలుగా అయితే జిల్లా ట్రెజరీలకు వచ్చిన పెన్షన్ ప్రపోజల్స్‌ను 15 రోజుల్లో సబ్ ట్రెజరీలకు పంపాలి. కాని 2-3 నెలల వరకు పడుతుండటం గమనార్హం. ముడుపుల కోసమే ఇంత జాప్యం జరుగుతుందనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఇటీవల వరకు జిల్లా ట్రెజరీ కార్యాలయం కలెక్టరేట్‌లోనే ఉండింది. జిల్లా కలెక్టర్, జేసీ ఇతర ఉన్నతాధికారులందరూ ఇక్కడే ఉండటంతో అవినీతి కొంత అదుపులో ఉండింది. ఇప్పుడు జిల్లా ట్రెజరీ కార్యాలయం బి.క్యాంపులోని ఫైనాన్స్ బిల్డింగ్‌లోకి వెళ్లింది. అక్కడికి వెళ్లిన తర్వాత విచ్చలవిడితనం పెరిగిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



➤ నీటి పారుదలశాఖలో అధికారి ఒకరు 2024 మే నెలలో పదవీ విరమణ చేశారు. ఈయనకు సంబంధించిన పెన్షన్ ప్రపోజల్స్ ఏజీ నుంచి అక్టోబరులో వచ్చాయి. అదే నెల 27న కర్నూలు డివిజన్ సబ్ ట్రెజరీ కార్యాలయంలో ఇచ్చారు. అయితే ట్రెజరీ సిబ్బంది నెల రోజుల పాటు వీటి ఊసే పట్టించుకోలేదు. తర్వాత సబ్‌ట్రెజరీ అధికారులను కలిస్తే మామూళ్లు ఇచ్చుకోవాల్సిందే అంటూ సిబ్బంది చెప్పారు. అయ్యా.. నేను ఉద్యోగంలో ఉండగా.. ఒక్క రూపాయి కూడా లంచం కింద తీసుకోలేదు. అలాంటప్పుడు నేను మీకు లంచం ఇవ్వలేనంటూ తేల్చి చెప్పారు. అలా అంటే ఎలా.. అంటూ ఒత్తిడి తెచ్చారు. ఈయనకు ఇప్పటికి గ్రాడ్యుటీ, 10 నెలల వేతనం, గ్రూపు ఇన్సూరెన్స్ దాదాపు రూ.50 లక్షల వరకు పెండింగ్‌లో ఉండిపోయింది.

➤ కర్నూలు ప్రభుత్వం ఆసుపత్రిలో పనిచేసే మహిళ ఒకరు గత ఏడాది జూన్‌లో పదవీ విరమణ చేశారు. ఈమెకు సంబంధించిన పెన్షన్ ప్రపోజల్స్ సెప్టెంబరులో సబ్ ట్రెజరీకి వెళ్లాయి. ముడుపుల కోసం సబ్ ట్రెజరీ సిబ్బంది చుక్కలు చూపించారు. ప్రతి సీటు వాళ్లు ముడుపులు కోసం డిమాండ్ చేశారు. రూ.20 వేల వరకు ముడుపులు చెల్లించారు. అయినా ఇప్పటికీ పెన్షన్ ప్రపోజల్స్ కొలిక్కి రాలేదు.

ఆమ్యామ్యాలంటేనే ఇష్టం

ట్రెజరీలో ఎంత తక్కువ వేతనం అనుకున్నా... రూ.65 వేల నుంచి రూ.70 వేల వరకు వేతనం ఉంటుంది. సీరియర్ అకౌంటెంట్లు, ఎస్టీవోలు తదితరులకు రూ.లక్ష నుంచి రూ.2 లక్షలకుపైగా వరకు వేతనాలు ఉన్నాయి. ప్రభుత్వం నుంచి భారీగా వేతనాలు పొందుతూ కూడా సాటి ఉద్యోగులను ముడుపుల కోసం పీడిస్తుండటం పట్ల సర్వత్రా ఆందోళన వ్యక్తం అవుతోంది. ట్రెజరీల్లో లంచావతారులు ఉన్నా రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం చేతులెత్తేసిందనే ఆరోపణలు ఉన్నాయి. ఉద్యోగులను పీడిస్తున్న ట్రెజరీల్లో పనిచేసే కొందరి సిబ్బందిపై చర్యలు తీసుకోవడం లేదనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది.

జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాం



కర్నూలు సబ్‌ట్రెజరీలో అక్రమాలు పెరిగిపోయాయి. పదవీ విరమణ చేసిన ఉద్యోగుల నుంచి లంచాలు వసూలు చేస్తున్నారు. వసూళ్లలో ఒక మహిళ డాన్‌గా గుర్తింపు పొందారనే విమర్శలు ఉన్నాయి. మా సంఘం దృష్టికి సబ్ ట్రెజరీ అవినీతిపై ఫిర్యాదులు వచ్చాయి. వీటిని వెంటనే జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాం. కలెక్టర్ స్పందించి విచారణకు ఆదేశాలు ఇచ్చారు. అవినీతి సిబ్బందిని వెంటనే అక్కడి నుంచి బదిలీ చేయాల్సిన అవసరం ఉంది. – కె. బలరాం, అధ్యక్షుడు, ప్రజాపరిరక్షణ సమితి, కర్నూలు

చర్యలు తీసుకుంటాం



ట్రెజరీల్లో అవినీతికి తావు లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. ఏజీ, లోకల్ ఫండ్ కార్యాలయాల నుంచి వచ్చే పెన్షన్ ప్రపోజల్స్‌ను ఎటువంటి జాప్యం లేకుండా సబ్ ట్రెజరీలకు పంపుతున్నాం. సబ్ ట్రెజరీల్లో కూడా సత్వరం పేమెంట్లు జరిగే విధంగా ఆదేశాలు ఇచ్చాం. కొందరు ఏళ్ల తరబడి ఒకే సీట్లలో ఉన్నారనే విమర్శల్లో కొంత వాస్తవం ఉంది. ఈ నెలలో ఏజీ ఆడిట్ ఉంది. ఆడిట్ తర్వాత సీట్ల మార్పుపై దృష్టి సారిస్తాం. – రామచంద్రరావు, జిల్లా ట్రెజరీ అధికారి, కర్నూలు

మూత'బడి'ంది!



ఇది పెద్దహోతూరు గ్రామంలోని ఉర్దూ ఎంపీపీ పాఠశాల. 25 ఏళ్ల క్రితం తమ ఊరి పిల్లల చదువు కోసం ఓ దాత స్థలం విరాళంగా ఇవ్వగా ప్రభుత్వం పాఠశాలను ఏర్పాటు చేసింది. 1 నుంచి 5 తరగతులు ఉన్న ఈ బడిలో దాదాపు 50 మంది విద్యార్థులు మొన్నటి వరకు విద్యనభ్యసించారు. అయితే గ్రామంలో చాలా మంది వలస వెళ్లడం, కొంత మంది విద్యార్థులు ప్రైవేటు పాఠశాలలకు వెళ్తుండటంతో చివరకు ముగ్గురు విద్యార్థులు మిగిలారు. దీంతో తల్లిదండ్రులు పిల్లలను సమీపంలోని ఆది ఆంధ్ర పాఠశాలలో చేర్పించారు. చివరకు విద్యా శాఖ అధికారులు ఏకోపాధ్యాయుడు ఇక్బాల్ మహ్మద్ బాషాను ఆలూరు ఉర్దూ మెయిన్ పాఠశాలకు డిప్యుటేషన్‌పై పంపి పాఠశాలకు తాళం వేశారు. – ఆలూరు

మద్యం దుకాణాల దరఖాస్తులకు గడువు పెంపు

- ఉమ్మడి జిల్లాలో ఇప్పటివరకు వచ్చినవి 50

కర్నూలు: ప్రభుత్వం గీత కులాలకు కేటాయించిన 21 మద్యం దుకాణాలకు లైసెన్సుల జారీకి దరఖాస్తుల స్వీకరణ గడువు ఈనెల 8వ తేదీ వరకు పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గత నెల 28వ తేదీన దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైంది. గజిట్ నోటిఫికేషన్‌లో పేర్కొన్న విధంగా బుధవారానికి గడువు ముగిసింది. ఆశావహుల నుంచి పెద్దగా స్పందన కనిపించక పోవడంతో మరో మూడు రోజులు గడువు పెంచుతూ 8వ తేదీ వరకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. కర్నూలు జిల్లాలో 10, నంద్యాల జిల్లాలో 11 దుకాణాలు గీత కులాలకు రిజర్వేషన్ ప్రాతిపదికన 2024-26 సంవత్సరాలకు మద్యం దుకాణాలు కేటాయిస్తూ ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. అయితే కర్నూలు జిల్లాలో కృష్ణగిరి, మద్దికెర దుకాణాలకు ఇప్పటివరకు ఒక దరఖాస్తు కూడా దాఖలు కాలేదు. మిగిలిన ఎనిమిది దుకాణాలకు 12 దరఖాస్తులు వచ్చాయి. అలాగే నంద్యాల జిల్లాలో 11 రిజర్వు దుకాణాలకు గాను ఇప్పటివరకు ఆరు దుకాణాలకు 38 దరఖాస్తులు వచ్చాయి. పగిడ్యాల, ఆళ్లగడ్డ, డోన్ మున్సిపాల్టీ, డోన్ రూరల్, ఉయ్యాలవాడ దుకాణాలకు ఒక్క దరఖాస్తు కూడా దాఖలు కాలేదు. నంద్యాల, పాములపాడు దుకాణాలకు ఎక్కువ దరఖాస్తులు వచ్చాయి. గత ఏడాది అక్టోబర్‌లో ఓపెన్ కేటగిరీ కింద ఉమ్మడి కర్నూలు జిల్లాలో 204 దుకాణాలు కేటాయించారు. అందులో కర్నూలు జిల్లాలో 99, నంద్యాల జిల్లాలో 105 లాటరీ పద్ధతిలో జనరల్ కేటగిరీ కింద దుకాణాలను కేటాయించారు. ఆ మొత్తం వాటిలో 10 శాతం దుకాణాలను గీత కులాలకు వారి జనాభా, షాపుల నిష్పత్తి ప్రకారం ఉమ్మడి జిల్లాలో మరో 21 దుకాణాలు ఏర్పాటు కానున్నాయి.

స్వయం ఉపాధిలో యువత రాణించాలి

- కలెక్టర్ రంజిత్ బాషా



కెనరా బ్యాంకు స్వయం ఉపాధి సంస్థ భవనాన్ని ప్రారంభిస్తున్న జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా

కర్నూలు(అగ్రికల్చర్): యువత నైపుణ్యాలను పెంపొందించుకుని స్వయం ఉపాధిలో రాణించాలని జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా అన్నారు. కర్నూలు శివారులోని బి.తాండ్రపాడులో డీఆర్‌డీఏ శిక్షణా కేంద్రం పక్కన రూ.2.50 కోట్లతో నిర్మించిన కెనరా బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ నూతన భవనాన్ని కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన శిక్షణ పొందుతున్న యువతతో ముఖాముఖి అయ్యారు. శిక్షణకు వినియోగిస్తున్న అత్యాధునిక సామగ్రిని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. చదవడం, రాయడంతో పాటు 10వ తరగతి, డిగ్రీ చదివిన వారికి సైతం స్వయం ఉపాధిలో రాణించేలా కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. కెనరా బ్యాంకు జనరల్ మేనేజర్ పాండురంగ మితన్ మాట్లాడుతూ.. శిక్షణ పొందిన వారికి తగిన రుణ సదుపాయం కల్పించడం ద్వారా స్వయం ఉపాధిలో రాణించేందుకు తమ బ్యాంకు సహకరిస్తుందన్నారు. కార్యక్రమంలో అసిస్టెంటు కలెక్టర్ చల్లా కళ్యాణి, కెనరా బ్యాంకు రీజినల్ మేనేజర్ సుశాంత్‌కుమార్, శిక్షణ సంస్థ డైరెక్టర్ పుష్పకుమార్, ఎల్‌డీఎం రామచంద్రరావు, డీఆర్‌డీఏ పీడీ నాగశివలీల పాల్గొన్నారు.

శ్రీశైలంలో 19 నుంచి 'మహా' బ్రహ్మోత్సవాలు

- మార్చి 1 వరకు నిర్వహణ



మాట్లాడుతున్న ఈఓ శ్రీనివాసరావు

శ్రీశైలంటెంపుల్: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ఈ నెల 19 నుంచి మార్చి 1వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు శ్రీశైల దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావు తెలిపారు. దేవస్థాన పరిపాలనా భవనంలోని సమీక్షా సమావేశ మందిరంలో దేవస్థాన అన్ని యూనిట్ విభాగాల అధికారులతో బుధవారం సాయంత్రం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ.. బ్రహ్మోత్సవ ఏర్పాట్లన్నీ పూర్తి నాణ్యతతో వీలైనంత త్వరగా పూర్తి చేయాలన్నారు. శివదీక్షా భక్తులకు ప్రత్యేక క్యూలైన్ , అలాగే అదనపు ప్రసాదాల విక్రయకేంద్రాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పాదయాత్రతో వచ్చే భక్తుల సౌకర్యార్థం నాగలూటి, పెద్దచెరువు, భీమునికొలను, కైలాసద్వారం, సాక్షిగణపతి మొదలైన ప్రాంతాల్లో చేయవలసిన ఏర్పాట్లన్నీ ముందస్తుగానే పూర్తి కావాలని ఆదేశించారు. అన్నప్రసాద వితరణలో తాజా కూరగాయలను వినియోగించాలని సూచించారు. డిప్యూటీ కార్యనిర్వహణాధికారి ఆర్.రమణమ్మ, ఈఈలు మురళీబాలకృష్ణ, నరసింహారెడ్డి, పలు విభాగాల ఏఈవోలు, పర్యవేక్షకులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక నిఘా



వెల్దుర్తి స్టేషన్‌లో సీజ్ చేసిన వాహనాలను పరిశీలిస్తున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

వెల్దుర్తి/కృష్ణగిరి: సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక నిఘా పెంచాలని ఎస్ఐలు అశోక్, మల్లికార్జునను ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశించారు. వెల్దుర్తి, కృష్ణగిరి పోలీస్‌స్టేషన్లను బుధవారం ఆయన తనిఖీ చేశారు. స్టేషన్లలో ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్కులు, నోటీసు బోర్డులు, రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. వెల్దుర్తి పోలీస్‌స్టేషన్‌లో పలు కేసులకు సంబంధించిన బైక్‌లు, కార్లు, ఇతరత్రా వాహనాలు ఎక్కువగా ఉండడంపై ఆరా తీశారు. శాంతి భద్రతలకు భంగం కలిగించే వారెవరిని ఉపేక్షించవద్దని ఆదేశించారు. పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. సమస్యలతో పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన ప్రజలను మంచి సేవలు అందించాలని సూచించారు. ఆయన వెంట సీఐ మధుసూదన్‌రావు తదితరులు ఉన్నారు.

పోలీసుల వేట

- దారి దోపిడీ దొంగల స్థావరంపై దాడి
- తప్పించుకున్న ఇద్దరు వ్యక్తులు
- చెంచుల బాణం తగిలి ఒకరికి గాయం
- మొక్కజొన్న పొలంలో నక్కిన దొంగలు
- రాత్రి వేళ ప్రత్యేక బృందాలతో గాలింపు



సాక్షి, నంద్యాల: సినిమా షూటింగ్‌ను తలపించే సన్నివేశాలు.. పొలాలు, వాగులు వెంట పోలీసుల పరుగులు.. వారికి సహాయంగా విల్లంబులు చేత పట్టిన చెంచులు.. గంటగంటకు ఉత్కంఠ.. చూస్తున్న వారికి ఏమి జరుగుతుందో తెలియని పరిస్థితి. చివరకు దొంగల కోసం పోలీసులు సాగించిన వేట అని తేలింది. ఇటీవల పాణ్యం, నంద్యాల ప్రాంతాల్లో రెండు దారి దోపిడీ ఘటనలు జరిగాయి. ఈ కేసుల దర్యాప్తు సాగిస్తున్న పోలీసులకు కీలక సమాచారం అందింది. గడివేముల మండలం కరిమద్దెల – పరమటూరు గ్రామాల మధ్య ఓ వాగు వద్ద దారి దోపిడీ దొంగలు స్థావరం ఏర్పాటు చేసుకున్నారని పక్కా సమాచారం అందింది. దీంతో బుధవారం సీఐలు కిరణ్ కుమార్ రెడ్డి, సురేష్, ఎస్ఐ నాగార్జునరెడ్డి ఆధ్వర్యంలో పాణ్యం, గడివేముల పోలీసులు, క్రైమ్ పార్టీ సిబ్బంది రంగంలోకి దిగారు. సాయంత్రం డ్రోన్‌తో పోలీసులు గాలిస్తుండగా ఓ ప్రాంతంలో దొంగల స్థావరం కనిపించింది. అక్కడికి సమీపిస్తుండగా వారిపై ఇద్దరు దుండగులు ఆయుధాలతో దాడికి యత్నిస్తూ పరారయ్యారు. కాగా ముందస్తు ఆలోచనతో సహాయంగా పోలీసులు వెంట తీసుకెళ్లిన చెంచులు విల్లంబులతో దాడి చేయగా ఓ దుండగుడికి బాణం గుచ్చుకున్నట్లు తెలిసింది. దొంగల స్థావరంలో పదునైన ఆయుధాలు, మద్యం, రెండు బ్యాగులు, ఐదు సెల్‌ఫోన్లు, సోలార్ లైట్లు లభించినట్లు సమాచారం. కాగా ఇద్దరు దొంగలు సమీపంలోని మొక్క జొన్న పొలంలో నక్కినట్లు తెలుసుకున్న పోలీసులు వారి కోసం పొలం నలువైపులా చుట్టుముట్టి గాలిస్తున్నారు. రాత్రి కావడంతో 30 మంది సిబ్బంది లైటింగ్ సహాయంతో నిఘా పెట్టారు. కాగా దొంగలకు సహాయకుడిగా ఉన్న కరిమద్దెలకు చెందిన ఓ యువకుడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం.

క్లుప్తంగా

పాలిటెక్నిక్ కాలేజీలో నేడు జాబ్ మేళా

కర్నూలు సిటీ: నగర శివారులోని ఎస్‌జీపీఆర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ ఫార్మసీ విభాగం ఆధ్వర్యంలో గురువారం జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ఆ కాలేజీ ప్రిన్సిపాల్ వీఎస్ఎస్ఎన్ ప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్ మేళాలో డీ ఫార్మసీ, బీ ఫార్మసీ, ఏదైన డిగ్రీ చదివిన విద్యార్థులు అర్హులని, ఆసక్తి కలిగిన వారు ఉదయం 10.30 గంటలకు బి.తాండ్రపాడులోని ఎస్‌జీపీఆర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీకి చేరుకోవాలని ఆయన పేర్కొన్నారు.

19 నుంచి టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు పరీక్షలు

కర్నూలు సిటీ: జిల్లాలో టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు పరీక్షలు ఈ నెల 19వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు డీఈఓ ఎస్.శామ్యూల్ పాల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సులైన టైలరింగ్ (హైయర్, లోయర్), డ్రాయింగ్(హైయర్, లోయర్) పరీక్షలు ప్రభుత్వ గుర్తింపు పొందిన కేంద్రాల్లో ఈనెల 22వ తేదీ వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు. అభ్యర్థులు హాల్ టికెట్‌ను www. bse. ap. gov. in నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు తప్పనిసరిగా పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో, ప్రభుత్వం జారీ చేసిన ఏదైన ఫొటో గుర్తింపు కార్డు తప్పనిసరిగా వెంట తెచ్చుకోవాలన్నారు.

ఏపీఈఆర్‌సీ కార్యాలయం తరలింపు విరమించుకోవాలి

కర్నూలు(సెంట్రల్): కర్నూలులో ఉన్న ఏపీఈఆర్‌సీ కార్యాలయాన్ని అమరావతికి తరలించే ప్రయత్నాలను విరమించుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ బుధవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. కర్నూలులో ఏర్పాటు చేసే హైకోర్టు బెంచ్‌ను ఏపీఈఆర్‌సీ భవనంలోకి తరలించి...అక్కడ దానిని అమరావతికి తరలించాలనుకోవడం సబబు కాదన్నారు. ప్రభుత్వం తన ప్రయత్నాలను విరమించుకోకపోతే పోరాటాలు తప్పవన్నారు. మరో వైపు కర్నూలులో ఉన్న రాష్ట్ర కార్యాలయాలను తరలించాలనుకోవడం సమంజసం కాదన్నారు.

గాయపడిన వృద్ధురాలి మృతి


తిప్పక్క (ఫైల్)

కోడుమూరు రూరల్: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వృద్ధురాలు తిప్పక్క (60) కోలుకోలేక మంగళవారం అర్ధరాత్రి మృతి చెందారు. దేవనకొండ మండలం పి.కోటకొండ గ్రామానికి చెందిన కృష్ణయ్య చిన్న కుమారుడు సురేష్ (21)కు ఈనెల 22, 23వ తేదీల్లో పెళ్లి చేయాలని పెద్దలు నిశ్చయించారు. ఇందులో భాగంగా మంగళవారం కె.నాగలాపురం సుంకులమ్మకు పూజలు నిర్వహించి బైక్‌పై అవ్వ తిప్పక్క(60)తో కలిసి సురేష్.. కోటకొండకు బయలుదేరాడు. మార్గమధ్యలో ఆగి ఉన్న లారీని బైక్ ఢీకొనడంతో తీవ్ర గాయాలతో సురేష్ మృతిచెందాడు. ఇదే ప్రమాదంలో గాయపడిన వృద్ధురాలు తిప్పక్క కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ అర్ధరాత్రి దాటిన తర్వాత కోలుకోలేక మృతిచెందింది. తిప్పక్క సొంతూరు దేవనకొండ మండలంలోని లక్కందిన్నె, సురేష్ స్వగ్రామం పి.కోటకొండలో తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి.

25 బైక్‌లు సీజ్


కోవెలకుంట్లలో నంబర్లు లేని ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకుంటున్న పోలీసులు

కోవెలకుంట్ల: స్థానిక పోలీస్ సర్కిల్ కార్యాలయ పరిధిలోని కోవెలకుంట్ల, సంజామల, రేవనూరు పోలీస్‌స్టేషన్లకు సంబంధించి బుధవారం రిజిస్ట్రేషన్లు లేని 25 బైక్‌లు సీజ్ చేసినట్లు సీఐ హనుమంతు నాయక్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కాలంలో గుర్తు తెలియని వ్యక్తులు నంబర్లు లేని బైక్‌లపై వెళుతూ రోడ్లపై నడుచుకుంటూ వెళుతున్న మహిళల మెడల్లోని బంగారు గొలుసులను అపహరించుకెళుతున్నారన్నారు. ఈ నేపథ్యంలో చోరీలను అరికట్టేందుకు పోలీస్ సర్కిల్ పరిధిలో నంబర్లు లేని ద్విచక్ర వాహనాలను గుర్తించి వాటిని స్వాధీనం చేసుకుంటున్నామన్నారు.

'విరి'పూసిన అందం



ఆకులు రాల్చుకుంటూ వాటి స్థానంలో పూలను ఇస్తూ టబేబుయా రోజా(రోజీ ట్రంపెట్ చెట్టు) ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మహానంది క్షేత్రంలోని ప్రసాదాల కౌంటర్ పక్కన ఈ వృక్షం కనువిందు చేస్తోంది. ప్రతి ఏడాది ఫిబ్రవరిలో మాత్రమే ఇది పుష్పిస్తుంది. దీన్ని ఎల్.సాల్విడార్ జాతీయ వృక్షం అంటారని, నల్లమల అడవుల్లో ఇలాంటి చెట్టు కనిపించదని అటవీ ప్రేమికుడు దూపాడు శ్రీధర్ తెలిపారు. – మహానంది

బురద మడిలో 'శ్వేత' వర్ణం



రబీలో వరి సాగుకు రైతులు బురద సేద్యాలు చేస్తున్నారు. నంద్యాల జిల్లా రుద్రవరం మండలం ఆర్.కొత్తూరు వద్ద ట్రాక్టర్‌తో సేద్యం చేస్తుండగా కొంగల సందడి కనిపించింది. పైరుకు హానికరమైన పురుగులు తింటూ రైతుకు ఎంతో మేలు చేస్తున్నాయి. బురద మడి నిండా తెల్లని కొంగల సమూహారంతో సరికొత్త దృశ్యం ఆవిష్కృతమైంది. – రుద్రవరం

రచ్చుమర్రి చోరీ కేసులో దొంగ అరెస్ట్

- 47 తులాల బంగారు, కేజీ వెండి ఆభరణాలు రికవరీ


స్వాధీనం చేసుకున్న నగలు, నిందితుడితో డీఎస్పీ ఉపేంద్రబాబు

మంత్రాలయం: మాధవరం పోలీస్ స్టేషన్ పరిధిలోని రచ్చుమర్రి గ్రామంలో జరిగిన చోరీ కేసులో దొంగను అరెస్ట్ చేసినట్లు ఎమ్మిగనూరు డీఎస్పీ ఉపేంద్రబాబు తెలిపారు. బుధవారం ఆయన మంత్రాలయం పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుడి వివరాలు వెల్లడించారు. రచ్చుమర్రి గ్రామానికి చెందిన శేషాద్రి శెట్టి కుటుంబ సభ్యులతో తీర్థయాత్రకు వెళ్లగా గత నెల 18వ తేదీన ఆయన ఇంట్లో చోరీ జరిగింది. బాధితుడు ఫిర్యాదు మేరకు గత నెల 25వ తేదీన కేసు నమోదు చేసి మంత్రాలయం సీఐ రామానుజులు నేతృత్వంలో మాధవరం ఎస్ఐ విజయకుమార్‌తో కలిసి విచారణ చేపట్టారు. అదే గ్రామానికి చెందిన దొండు నాగేంద్ర అనే యువకుడు చోరీకి పాల్పడినట్లు సాంకేతిక పరిజ్ఞానంతో గుర్తించారు. ఈ మేరకు బుధవారం మాధవరం సరిహద్దులోని వంతెన దగ్గర ఉన్న నాగేంద్రను పోలీసులు అదుపులో తీసుకుని 47 తులాల బంగారు ఆభరణాలు, ఒక కేజీ వెండి వస్తువులు, రూ.2.50 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. చోరీ కేసును చేధించిన మాధవరం ఎస్ఐ విజయ్‌కుమార్, కానిస్టేబుల్‌లు రఘు, రామాంజినేయులు, వీరేష్, విజయ్‌ప్రసాద్, హెడ్‌కానిస్టేబుల్ గురుమూర్తిలకు డీఎస్పీ ఉపేంద్రబాబు రివార్డులు అందజేశారు. నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పర్చనున్నట్లు డీఎస్పీ వెల్లడించారు.

మొదటి మహిళా కమాండెంట్‌గా దీపిక పాటిల్


కర్నూలు ఏపీఎస్పీ కమాండెంట్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న దీపిక పాటిల్

కర్నూలు: ఏపీఎస్పీ కర్నూలు రెండో బెటాలియన్ మొదటి మహిళా కమాండెంట్ ఎం.దీపిక పాటిల్ బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్ర వ్యాప్త బదిలీల్లో భాగంగా కాకినాడ ఏపీఎస్పీ మూడో బెటాలియన్ కమాండెంట్‌గా పనిచేస్తున్న ఈమెను కర్నూలు రెండో బెటాలియన్ 32వ కమాండెంట్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. పటాలం పరిపాలన విభాగం కార్యాలయంలో బుధవారం ఉదయం ఆమె బాధ్యతలు స్వీకరించారు. అంతకుముందు అధికారులు ఆమెకు మొక్కలు, పుష్పగుచ్ఛాలు ఇచ్చి ఘన స్వాగతం పలికారు. కర్నూలు ఏపీఎస్పీ బెటాలియన్ 1952లో ఏర్పాటయ్యింది. అప్పటినుంచి ఇప్పటివరకు ఏడుగురు ఐపీఎస్ అధికారులు ఇక్కడ కమాండెంట్లుగా వ్యవహరించగా 8వ ఐపీఎస్ అధికారిగా, మొదటి మహిళా కమాండెంట్‌గా దీపిక పాటిల్ వచ్చారు. ఏపీ కేడర్‌కు చెందిన ఈమె 2014 ఐపీఎస్ అధికారిణి. ప్రకాశం జిల్లాలో శిక్షణ పూర్తయిన తర్వాత మొదట గ్రేహౌండ్స్‌లో అసాల్ట్ కమాండర్‌గా పనిచేశారు. అనంతరం పార్వతీపురం, తిరుపతి ఏసీబీ, కర్నూలు ఏఎస్పీగా, గుంటూరు సీఐడీ విభాగంలో ఏడీజీగా, ఏపీలో దిశ చట్టం అమలు కోసం ప్రత్యేక అధికారిణిగా కొంతకాలం విధులు నిర్వహించారు. ఈమె తండ్రి మండవ హర్షవర్ధన్ జార్ఖండ్ ఐపీఎస్ అధికారి. కృష్ణా జిల్లా ఆముదాల లంక స్వగ్రామం. ఈమె సోదరుడు హర్షవర్ధన్ కూడా ఐపీఎస్ అధికారి. ప్రస్తుతం జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్, దీపిక పాటిల్ భార్యాభర్తలు. వీరిది ప్రేమ వివాహం. ప్రస్తుతం వీరిద్దరూ కాకినాడ నుంచి కర్నూలుకు బదిలీపై వచ్చారు.

మద్యం సేవించి విధులకు వస్తే చర్యలు...

మద్యం సేవించి విధులకు వస్తే అలాంటి వారి పట్ల కఠినంగా వ్యవహరించాలని దీపిక పాటిల్ అధికారులకు సూచించారు. పటాలంలో మినరల్ వాటర్ ప్లాంట్, ఆఫీసర్స్ మెస్, బెటాలియన్ క్యాంటీన్, సురక్ష వెల్ఫేర్ స్టోర్, సాయుధ పోలీస్ విద్యానికేతన్ స్కూల్, బెటాలియన్ కల్యాణ మండపం, ఆయుధాగారం తదితర వాటిని సందర్శించి వాటి నిర్వహణ తీరును అడిగి తెలుసుకున్నారు. బళ్లారి చౌరస్తాలో ఆంజనేయస్వామి గుడి వెనుక (పటాలం స్థలంలో) రోడ్డు డైవర్షన్ ప్రతిపాదన ఉందని, అయితే హెడ్ క్వార్టర్ కార్యాలయం నుంచి ఎలాంటి అనుమతి రాలేదని కమాండెంట్ దృష్టికి తెచ్చారు. అలాగే కల్యాణ మండపం నిర్మాణం పనుల్లో ఎందుకు జాప్యం జరుగుతుందని కమాండెంట్ ఆరా తీశారు. పటాలంలో పనిచేసే సిబ్బంది, అధికారులు క్రమశిక్షణకు మారుపేరుగా ఉండాలని సూచించారు. కమాండెంట్ వెంట అదనపు కమాండెంట్ నాగేశ్వరరావు, సహాయ కమాండెంట్లు ఎస్.ఎం.బాషా, డి.వి.రమణ, డీఎస్పీలు షర్ఫుద్దీన్, సుధాకర్‌రెడ్డి, రవికిరణ్ తదితరులు ఉన్నారు.


రైతును మస్కా కొట్టి రూ. 40 వేల చోరీ

- వృద్ధ మహిళ నుంచి రూ. 50 వేలు అపహరణ


ఏటీఎం కేంద్రంలో రైతుతో పాటు గుర్తు తెలియని వ్యక్తి

ఎమ్మిగనూరురూరల్: పట్టణంలోని భారతీయ స్టేట్ బ్యాంక్ దగ్గర ఉన్న ఏటీఎం కేంద్రంలో రైతును మస్కా కొట్టి రూ. 40 వేలు చోరీ చేశారు. అలాగే వృద్ధ మహిళ నుంచి రూ. 50 వేలు అపహరణ చేశారు. వివరాలు.. పెద్దకడుబూరు మండలం జాలవాడి గ్రామానికి చెందిన సత్యన్న అనే రైతు విజయవాడలో చదువుతున్న తన కుమారుడికి డబ్బులు పంపేందుకు బుధవారం ఎస్‌బీఐ దగ్గర ఏటీఎం కేంద్రం దగ్గరకు వెళ్లాడు. అక్కడ ఉన్న ఓ వ్యక్తికి డబ్బులు డ్రా చేసి ఇవ్వాలని ఏటీఎం కార్డు ఇవ్వడంతో మస్కా కొట్టించాడు. పిన్ వివరాలు తెలుసుకుని.. డబ్బులు డ్రా చేయకుండా నకిలీ ఏటీఎం కార్డును తిరిగి ఇచ్చారు. రైతు వెళ్లిన తర్వాత తస్కరించిన ఏటీఎం కార్డుతో రూ. 40 వేలు డ్రా చేసుకొని పరార్ అయ్యాడు. తన వద్ద ఉన్నది నకిలీ ఏటీఎం కార్డు అని తెలుసుకుని రైతు సత్యన్న ఎమ్మిగనూరు పట్టణ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశాడు. అలాగే మధ్యాహ్నం ఎస్‌బీఐ బ్యాంక్ దగ్గర వెంకమ్మ అనే వృద్ధ మహిళ డబ్బులు డ్రా చేసుకొని వెళ్తుండగా వెనకనే ఉన్న దొంగ రూ. 50 వేల నగదును ఎత్తుకెళ్లాడు. దొంగ పరార్ కావటంతో బోరున విలపిస్తు వృద్ధురాలు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

కొండ ముచ్చు దాడి.. ఇద్దరికి గాయాలు



గాయపడిన దస్తగిరి, జమ్ములమడుగు క్రాస్ రోడ్డులో ఉన్న కొండ ముచ్చు

కొలిమిగుండ్ల: స్థానిక జమ్ములమడుగు క్రాస్ రోడ్డులో బుధవారం కొండ ముచ్చు దాడిలో ఇద్దరు గాయపడ్డారు. సంజామల మండలం రామిరెడ్డిపల్లెకు చెందిన టిప్పర్ డ్రైవర్ దస్తగిరి భోజనం చేసేందుకు వాహనాన్ని నిలిపి హోటల్‌లోకి వెళుతున్న సమయంలో కొండ ముచ్చు దాడి చేయడంతో చెంపకు 20 కుట్లు పడ్డాయి. అలాగే సమీపంలోనే దుకాణం నిర్వహిస్తున్న లక్ష్మీదేవి అనే మహిళపై కూడా దాడి చేయడంతో ఆమెకు గాయాలయ్యాయి. పది రోజుల పైబడి నుంచి కొండ ముచ్చు జమ్ములమడుగు క్రాస్ రోడ్డులో తిష్టవేసింది. చుట్టు పక్కల హోటళ్లు, ఇతర వ్యాపార సముదాయాలు, నివాసాల వద్దకు వెళుతూ ఉంటుంది. దీంతో స్థానికులు తమపై ఎక్కడ దాడి చేస్తుందోనని భయాందోళనకు గురవుతున్నారు. అటవీ శాఖ అధికారులు స్పందించి కొండ ముచ్చును ఇక్కడి నుంచి తరలించాలని స్థానికులు కోరారు.

వలస వద్దన్నందుకు యువకుడి ఆత్మహత్య


రంగప్ప (ఫైల్)

హొళగుంద: ఉన్న ఊర్లోనే బతుకుదాం.. బెంగళూరుకు వలస వెళ్లొద్దని తల్లి మందలించడంతో రంగప్ప(25) అనే యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన నిత్రవట్టి గ్రామంలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యుల వివరాల మేరకు..తాను బెంగళూరుకు వలస వెళ్లి బతుకుతానని తల్లి బసమ్మతో కుమారుడు రంగప్ప అన్నాడు. తల్లి మందలించడంతో రంగప్ప ఇంటి నుంచి మంగళవారం బయటకు వెళ్లిపోయాడు. రాత్రి అయినా ఇంటికి రాకపోవడంతో బంధువులకు, చుట్టుపక్కల వారికి ఫోన్ చేసి తల్లి విచారించింది. బుధవారం గ్రామ పొలాల్లో పురుగుమందు తాగి విగతజీవిగా పడి ఉన్న రంగప్ప మృతదేహాన్ని చూసి గొర్రెల కాపరులు తల్లికి సమాచారం అందించారు. ఒక్కగానొక్క కుమారుడు పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకోవడంతో తల్లి బోరుమని విలపించింది. 'భర్త 20 యేళ్ల క్రితమే కాలం చేశాడని, ఉన్న ఒక్కగానొక్క కుమారుడు లేకపోతే ఎలా బతకాలి' అని తల్లి రోదించడం కలచి వేసింది. ఎస్ఐ చంద్ర ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఆత్మకూరులో చైన్ స్నాచింగ్

ఆత్మకూరురూరల్: ఆత్మకూరు పట్టణంలోని ఇందిరానగర్ కాలనీలో చైన్ స్నాచింగ్ జరిగింది. కాలనీకి చెందిన జయామణి స్థానిక ఆసుపత్రిలో నర్సుగా విధులు నిర్వర్తిస్తున్నారు. మంగళవారం రాత్రి విధులు ముగించుకుని ఇంటికి నడుచుకుంటూ వెళ్తుండగా బైక్‌పై వచ్చిన ఇద్దరు వ్యక్తులు ఆమె మెడలో ఉన్న రెండు తులాల బంగారు గొలుసును తెంచుకు ని పరారయ్యారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దొంగల ఆచూకీ కోసం గాలింపు చేపట్టారు. పట్టణంలో సీసీ కెమెరా ల ఫుటేజీని పరిశీలిస్తున్నామని, దొంగలను త్వరలో పట్టుకుంటామని సీఐ రాము బుధవారం తెలిపారు.

సబ్సిడీతో 'మత్స్య' యూనిట్లు

కర్నూలు(అగ్రికల్చర్): ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన కింద మత్స్యకారులు, ఔత్సాహిక వ్యాపారవేత్తలకు ఉపయోగపడే విధంగా పలు కార్యక్రమాలను అమలు చేస్తున్నట్లుగా జిల్లా మత్స్యశాఖ అధికారి శ్యామల తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మొత్తం 117 యూనిట్లు ఉన్నాయని, ఎస్సీ, ఎస్టీలు, మహిళలకు 60 శాతం, ఇతరులకు 40 శాతం సబ్సిడీ ఉంటుందని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు కర్నూలు బంగారుపేటలోని మత్స్యశాఖ కార్యాలయం, సంబంధిత మత్స్య అధికారులను సంప్రదించాలని సూచించారు.

వృద్ధుడి ఆత్మహత్య

వెలుగోడు: రిజర్వాయర్ సమీపంలో పురుగుల మందు తాగి భాష్యం బాలయ్య (68) అనే వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మాధవరం గ్రామానికి చెందిన భాష్యం బాలయ్య ఆర్టీసీ డ్రైవర్‌గా రిటైర్డ్ అయ్యాడు. ఆరు సంవత్సరాల క్రితం బ్రెయిన్ స్ట్రోక్ కు గురయ్యాడు. అప్పటినుంచి అనారోగ్యంతో మతిస్థిమితం లేక కుమారుడు దగ్గరనే నంద్యాలలో ఉంటున్నాడు. ఏడాదిన్నర క్రితం భార్య కూడా మృతి చెందడంతో మరింత కుంగిపోయాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెంది బుధవారం తెల్లవారుజామున రిజర్వాయర్ సమీపంలో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుడి కుమారుడు శ్రీనివాసులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు వారు తెలిపారు.

8న నారీ శక్తి చైతన్య సమ్మేళనం

కర్నూలు కల్చరల్: వికాస భారతి ఉమ్మడి జిల్లా ధార్మిక సామాజిక సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 8వ తేదీన 'నారీ శక్తి చైతన్య సమ్మేళనం' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈనెల 9వ తేదీన నిర్వహించాల్సి ఉన్న కార్యక్రమాన్ని కొన్ని అనివార్య కారణాలతో 8వ తేదీకి మార్చినట్లు పేర్కొన్నారు. ఓర్వకల్లు మండల పరిధి కాల్వబుగ్గ సమీపంలోని సురభి గోశాల భారతీయ స్ఫూర్తి కేంద్రంలో ఈ కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు. మొదటి సెషన్‌లో 'వివిధ సందర్భాలలో మన పూర్వీకులు పోషించిన పాత్ర' అనే అంశంపై వికాస భారతి వ్యవస్థాపకులు బీవీ నాగేంద్ర ప్రసాద్ ముఖ్య వక్తగా ప్రసంగిస్తారని తెలిపారు. రెండవ సమావేశంలో 'విలువలతో కూడిన సమాజ నిర్మాణంలో స్త్రీ పాత్ర' అనే అంశంపై జి. భారతీయం సత్యవాణి ప్రధాన వక్తగా హాజరై ఉపన్యసిస్తారని పేర్కొన్నారు.

15, 16న సాయి హాస్టల్‌కు ఎంపిక

కర్నూలు (టౌన్): సాయి (స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా) హాస్టల్‌కు ఈనెల 15, 16 తేదీల్లో క్రీడాకారుల ఎంపిక ఉంటుందని సాయి కర్నూలు సెంటర్ ఇన్‌చార్జ్ పి. చంద్రశేఖర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కర్నూలు స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో ఎంపిక చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. క్రీడాకారులు 2008 నుంచి 2013 మధ్య జన్మించి ఉండాలని తెలిపారు. జిల్లా స్థాయి పైన జరిగిన పోటీల్లో మొదటి, రెండవ, మూడవ స్థానాలు, మెడల్స్ సాధించిన వారు అర్హులని పేర్కొన్నారు. వివరాల కోసం 9966377846 సెల్ నంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

దళితుల భూములు.. కారు చౌకగా ఇవ్వం

- జాయింట్ కలెక్టర్‌తో రైతుల వాగ్వాదం

కర్నూలు(రూరల్): ఓర్వకల్లు ఎయిర్‌పోర్టు అభివృద్ధి కోసం తీసుకుంటామని చెప్పిన భూములు దళితులవని, వాటిని కారుచౌకగా ఇచ్చే ప్రసక్తే లేదని రైతులు స్పష్టం చేశారు. ఎకరా భూమికి నష్టపరిహారంగా రూ. 40 లక్షలు ఇవ్వాలని, అలాగే భూమిని కోల్పోయే ప్రతి కుటుంబంలో ఒకరి ఉద్యోగం ఇవ్వాలని కోరారు. కర్నూలు ఆర్డీఓ కార్యలయంలో బుధవారం నెగోషియేషన్ కమిటీ నిర్వహించారు. కర్నూలు జాయింట్ కలెక్టర్ బి.నవ్య, కర్నూలు ఆర్డీఓ కిడారి సందీప్ కూమర్, ఓర్వకల్లు తహసీల్దార్ విద్యాసాగర్ హాజరయ్యారు. భూములు కోల్పోయే ఓర్వకల్లు మండలం పూడిచెర్ల, కన్నమడకల గ్రామ రైతులతో మాట్లాడారు. తాము మూడు తరాల నుంచి భూములను సాగు చేసుకుని జీవిస్తున్నామని, ఎంతో విలువైన స్థలాన్ని కారుచౌకగా తీసుకోవాలని చూడటం అన్యాయమని రైతులు తెలిపారు. మొత్తం 45 మంది రైతులకు చెందిన 35 ఎకారాల భూమిని ఎకరాకు రూ. 17 లక్షలు ఇచ్చి తీసుకుంటామని అని ప్రకటించగా జేసీతో రైతులు వాగ్వాదానికి దిగారు. తక్కువ ధరకు భూమిని తాము ఇవ్వబోమని అధికారులకు రైతులందరూ తెలియజేశారు. రైతుల నిర్ణయాన్ని ప్రభుత్వానికి చెబుతామని జేసీ హామీ ఇచ్చారు.

విద్యుదాఘాతంతో ఎలక్ట్రీషియన్ మృతి


మృతి చెందిన బోయ కృష్ణ

శ్రీశైలం: విద్యుదాఘాతానికి గురై ఎలక్ట్రీషియన్ మృతిచెందాడు. బుధవారం శ్రీశైలంలో ఈ సంఘటన జరిగింది. వివరాల్లోకి వెళితే..ఈనెల 19 నుంచి మహాశివరాత్రి బ్రహోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో విద్యుత్ సంబంధ పనులను శ్రీశైల దేవస్థానం అధికారులు కాంట్రాక్టర్ చంద్రశేఖర్ రెడ్డికి అప్పగించారు. ఈయన కార్మికులతో విద్యుత్ లైట్ల ఏర్పాటు తదితర పనులు చేయిస్తున్నారు. బుధవారం బోయ కృష్ణ (32) అనే ఎలక్ట్రీషియన్ విద్యుత్ స్తంభం ఎక్కి పనిచేస్తుండగా హఠాత్తుగా విద్యుత్ సరఫరా కావడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందాడు. దేవస్థానం ఆసుపత్రి వద్ద ఉన్న జనరేటర్ నుంచి రివర్స్ కరెంట్ పాస్ కావడంతో ఈ ఘటన చోటు చేసుకుందని విద్యుత్ అధికారులు తెలిపారు. తాము విద్యుత్ నిర్వహణ పనులు చేసే ప్రదేశాన్ని ముందస్తుగానే దేవస్థానం ఎలక్ట్రికల్ విభాగం అధికారులకు తెలియజేశామని వారు చెప్పగా.. విద్యుత్ శాఖ నుంచి సరైన సమాచారం లేదని వీరు ఇలా ఇరువురి మధ్య సమన్వయలోపమే ఓ వ్యక్తి ప్రాణాలు తీసిందని స్థానికులు చెబుతున్నారు. ఇదిలా ఉంటే మృతి చెందిన ఎలక్ట్రీషియన్‌ది జోగులాంబ గద్వాల జిల్లా పరిధిలోని రంగాపురం గ్రామం. ఇతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఐదురోజుల క్రితం పనిలో చేరినట్లు సమాచారం.

శిక్షణ ఇచ్చేందుకు దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు (సిటీ): రాణి లక్ష్మీబాయి ఆత్మరక్ష పరిశీలన – ఆత్మ రక్షణ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు శిక్షణ ఇచ్చేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సమగ్ర శిక్ష అదనపు కో ఆర్డినేటర్ టి.శ్రీనివాసులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో మొత్తం 460 పాఠశాలల్లోని విద్యార్థినులకు శిక్షణ ఇచ్చేందుకు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. అర్హత, టెక్నికల్ క్వాలిఫికేషన్ వివరాలు, ఎంపిక విధానం, దరఖాస్తు సమర్పించవలసిన సర్టిఫికెట్స్ వివరాలు https:// rvmssakurnool. blogspot. com/ లో ఉన్నాయని తెలిపారు. పూర్తి చేసిన దరఖాస్తులను ఈనెల 10వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు కర్నూలు కలెక్టరేట్‌లోని సమగ్ర శిక్ష కార్యాలయంలోని టెండర్ బాక్స్‌లో వేయాలని పేర్కొన్నారు.

కందుల కొనుగోళ్లు ముమ్మరం

- రైతులకు నాఫెడ్ ఏపీ ఇన్‌చార్జ్ శర్మ సూచనలు


కందుల నాణ్యతను పరిశీలిస్తున్న నాఫెడ్ ఏపీ ఇన్‌చార్జ్ శర్మ తదితరులు

కర్నూలు(అగ్రికల్చర్): మద్దతు ధరతో కందుల కొనుగోలు ప్రక్రియను ముమ్మరం చేసినట్లుగా నాఫెడ్ ఆంధ్రప్రదేశ్ ఇన్‌చార్జ్ టీఎస్ శర్మ తెలిపారు. బుధవారం ఆయన కర్నూలు మండలం పంచలింగాల గ్రామంలో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో డీసీఎంఎస్ ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. రైతులు తెచ్చిన కందుల నాణ్యత ప్రమాణాలను పరిశీలించారు. కనీస నాణ్యత ప్రమాణాలతో తెస్తే ప్రతి రైతుకు మద్దతు ధర రూ.7,550 లభిస్తుందని పేర్కొన్నారు. కందుల కొనుగోలు ప్రక్రియ కేంద్ర ప్రభుత్వ రంగసంస్థ అయిన నాఫెడ్ ద్వారా జరుగుతున్నాయని తెలిపారు.ఆయన వెంట మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ జి.రాజు, డీసీఎంఎస్ కర్నూలు బ్రాంచి మేనేజర్ రాజీవ్ తదితరులు పాల్గొన్నారు.

ఈబీసీ, కాపు రుణాలకు దరఖాస్తు చేసుకోండి

కర్నూలు (అర్బన్): బీసీ కార్పొరేషన్ ద్వారా అమలవుతున్న సబ్సిడీ రుణాలకు ఈబీసీ (కమ్మ, రెడ్డి, ఆర్యవైశ్య, బ్రాహ్మణ, క్షత్రియ, కాపు) కులాలకు సంబంధించినవారు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని కార్పొరేషన్ ఈడీ ఎస్.జాకిర్ హుసేన్ కోరారు. బుధవారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ రుణాలకు దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 7వ తేదీ వరకు మాత్రమే గడువు ఉందని చెప్పారు. అర్హత కలిగిన లబ్దిదారులు https:// apobmms. apc. fss. in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆయా కులాలకు సంబంధించి కుల ధ్రువీకరణ పత్రాలు లేని పక్షంలో సెల్ఫ్ డిక్లరేషన్‌తో వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇప్పటి వరకు అందిన సమాచారం మేరకు ఈబీసీ కులాలకు చెందినవారు తక్కువ సంఖ్యలో దరఖాస్తు చేసుకున్నారని చెప్పారు. ఉమ్మడి జిల్లాలో ఆయా కులాలకు అధిక యూనిట్లు ఉన్నందున అర్హత కలవారందరూ దరఖాస్తు చేసుకోవాలని కోరారు.